# కొత్త వెలుగులో చూడు

**'వాసంతి'**

జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

బయట బస్సు హారన్, వెంటనే గోలగోలగా పిల్లల మాటలు విని చేతిలో పని వొదిలి బయటికి వచ్చింది అన్నపూర్ణ. గుమ్మంలో బస్సు ఆగి వుంది. బస్సులోంచి ఉడుతల్లా దూకుతున్నారు పిల్లలు. చిన్నవాళ్లు పడకుండా చెయ్యందిస్తున్నాడు రాఘవుడు.

"బస్సు ఇంటికే వచ్చేసిందేమిట్రా రాఘవా?" ఆశ్చర్యంగా అంది అన్నపూర్ణ.

"బస్సులో ఇంక మిగిలినవాళ్లు మన తండాయేనమ్మా. ఆ మూకని రోడ్డు మీద కంట్రోలు చెయ్యలేనని వాళ్లని బతిమాలి తీసుకువచ్చాను. ఒకళ్లా, ఇద్దరా, పద్దెనిమిదిమంది. అందులో ఆరుగురు మరీ బుడతలు కదా. రోడ్డు మీద నా కష్టం ఊహించుకోమనేసరికి వాళ్లు పాపం ఒప్పుకొన్నారు" ఆఖర్న దిగిన సిద్ధుని ఎగరేసి ఎత్తుకుంటూ అన్నాడు రాఘవ.

"అక్కలు, బావలు ఏరిరా?"

"వీళ్ల ధాటికి ఆగలేక మధ్యలో దూకి పారిపోయారు."

"లేదులే, అమ్మమ్మా, ఈ వేళ ఇక్కడ సంత కదా, జీళ్లు, బుఱ్ఱగుంజు, తేగలు, నెమలి కన్నులు దొరికినవన్నీ తెస్తామని దిగేరు. వచ్చే వారం దాకా ఉంటే అందర్నీ తీసుకెడతారుట." పెద్దమ్మాయి చిన్నకూతురు శిశిర, సామాను అరుగు మీద పెడుతూ చెప్పింది.

మా స్నేహితులకు తెలుగువారి పల్లెటూరు జీవితం పూర్తిగా చూపిస్తామని నాన్న, బాబయ్య ఒప్పుకున్నారు. అరుగో వస్తున్నారు.

శిశిర మాటలు పూర్తవకుండానే సంచులు తెచ్చి గోడకు ఆనించారు కృష్ణ, ఆనంద్. మట్టి బొమ్మల కోసం, బుడగల కోసం దాడి చేసిన పిల్లల్ని తప్పించుకుంటూ తల్లి దగ్గరకు వచ్చారు హైమా, శిశిర. "అమ్మా ఈ పిల్లలందర్నీ ఎలా సర్దమంటావమ్మా?"

అన్నపూర్ణ సంభ్రమం నుండి బయట పడింది. "వాళ్ల సంగతి పెద్దపిల్లల సాయంతో నేను చూసుకుంటా లెండమ్మా. పాపం ఇంటి దాకా తీసుకువచ్చి వదిలేరు, డ్రైవరుకి, కండక్టరుకి కాఫీ, టిఫిన్ ఇవ్వండి. ఇందిర వదినా, కిరణ్ వంటింట్లో ఉన్నారు, పిల్లలు తయారై వచ్చేసరికి వాళ్లక్కూడా టిఫిన్లు సిద్ధం చేయండి. పిల్లలూ, రండమ్మా."

శివయ్యకు, అన్నపూర్ణకు అందర్నీ చూస్తుంటే సంబరంలో మాట తోచటం లేదు. ఏడేళ్ల క్రితం శశి పెళ్లిలో పిల్లలంతా కలిశారు, మళ్లీ ఇంత కాలానికి అందర్నీ ఒక చోట అందర్నీ, మన ఇంట్లో చూచుకోవటం ఇదంతా నిజమేనా అనిపిస్తోంది.

అన్నపూర్ణ జవాబియ్యబోయింది. హేమ పెద్దకూతురు సుజాత అతిథుల్ని పరిచయం చేసింది. "అమ్మమ్మా, మా స్నేహితుల్ని తీసుకువచ్చాం చూడు. లీలా, సునీతా, రజనీ, జయ, సుమన్, గిరి, నా క్లాసు మేట్లు. ఎవరూ ఇంత వరకు హైదరాబాద్ దాటి ఆంధ్రా చూడలేదు. అంతా బాంబే, ఢిల్లీ సరుకు. సురేష్, హరి, మోహన్, శ్రీను ఫ్రెండ్స్ పిల్లలే. ధీరకి బాగా ఫ్రెండ్స్. అదీ, సిద్ధూ వాళ్లకి నాయకులు... నందూ, బన్నీ, మున్నీ, చిట్టి, నేహ.. సిద్ధుగాడేడి?

"వాడికిక్కడ ఒక గుంపుండాది లేమ్మా, మొన్న సెలవలకు వచ్చి పోగేశాడులే, వాళ్లని చూసి వస్తాడు, మీరు పదండి."

చిన్నపిల్లలంతా కాసేపట్లో ఆటల్లో పడిపోయారు. పెద్దపిల్లలు తోటలో తిరిగి సాయంత్రానికి పళ్లు కోసుకొచ్చారు. సుజాత స్నేహితురాళ్లకు వచ్చిన సందేహాలకు జవాబులివ్వలేక అంతా చేతులెత్తేశారు. ఇక వాళ్లు వచ్చి అన్నపూర్ణ చుట్టూ చేరారు, ఇదెల్లాగా, అదెల్లాగా అంటూ.

పక్కవాళ్లు పిలిచారు పేరంటానికి వెళ్ళేవాళ్లు తయారు కావాలని హేమ చెప్పటంతో, సుజాత స్నేహితురాన అదేమిటో తెలుసుకొని వెళ్లటానికి లేచారు. అన్నపూర్ణ తెరిపిన పడింది. "ఈ పిల్లలేమిటే సుజాతా, అన్నీ వింతలె, ఇదెట్లా, అదెట్లా అని చంపేస్తున్నారు."

"వీళ్లింతే అవమ్మవెమ్మా, అంతా పిజ్జా, బర్గర్ కల్చర్ వాళ్లనుకో."

"అది తెలుస్తుందిలే. రేపు కూరలో తెలకపిండి వేస్తే తింటారా?"

"వెయ్యి కాని, వాళ్లకు చెప్పకు. తెలకపిండి చెట్టు చూపించమంటారు."

"సర్లే, నీవు కూడా త్వరగా తయారయి ఆలస్యం కాకుండా పేరంటానికి వెళ్లి రండి."

000

రాత్రి భోజనాలయేక అందరూ టీవీ చుట్టూ చేరబోయారు. సిద్ధు ఒప్పుకోలేదు. "ఇప్పుడంతా డాబా గదికి రావాలి."

"అది తాతగారి గది కదరా!"

"తాత నేను ఉన్నన్నాళ్లూ కథలు చెప్తారు లీలక్కా, మీరు రండి".

కృష్ణకు, పిల్లలకు తాత చెప్పే కథలు ఇష్టం ఉండవు.

అర్థం లేని పిచ్చికథలు చెప్పి పిల్లలని పాడుచెయ్యటం, గారాం చేయటం నచ్చవు అతనికి. తాత అండ చూసుకొని రెచ్చిపోతారని అతనికి కోపం. హైమ హెచ్చరికతో ఊరుకున్నాడు.

అంతా గదిలోకి వెళ్ళేసరికి అక్కడ సిద్ధు స్నేహితులు, పక్క ఇళ్ల లోంచి వచ్చి తాత కథ కోసం సిద్ధంగా ఉన్నారు. అంతా తాత చుట్టూ చేరారు.

"తాతా, ఈ రోజు పేను కథ చెప్పు."

శివయ్య సర్దుకొని కూర్చుని మొదలుపెట్టబోతుండగా, కృష్ణ అడ్డు పడ్డాడు.

"అలాంటి పిచ్చి కథలతో పిల్లల ఐ.క్యూ. తగ్గిపోతుంది మామయ్యా. మెచ్యూర్ థింకింగ్ అలవాటవదు. బోలెడు మంచి పుస్తకాలు తెచ్చేను. అవి చదువుకుంటారు. సిద్ధుకి పెద్ద పిల్లలు చదివి పెట్టవచ్చు."

సిద్ధు ముఖం చిన్నబోయింది. కథ కోసం వచ్చిన వాడి స్నేహితులు నిరుత్సాహపడి ఇళ్లకు వెళ్లటానికి లేచారు.

"ఈ రోజుకి పిల్లలకు నచ్చినట్లు చేద్దాం, కృష్ణా. రేపటి నుండి మారుద్దాంలే."

హైమ సైగ అందుకుని అనిష్టంగానే ఊరుకుని బయటకు నడిచాడు కృష్ణ.



"పేను కథా?" పెద్ద పిల్లలు లేవబోయారు. "చిన్నప్పటి కథలు పెద్దయ్యేక తలా తోకా లేనివిగా కనిపిస్తాయి కాని, ఈ రోజుకు కూర్చోండి." తాత మాటలు కాదనలేక అంతా కూర్చున్నారు.

పేను పెసరచేను వెయ్యటం, అది పెరగటం, పెసరట్లు అందరూ తినటం, రాజు ఛీత్కరించటం, సన్నివేశాలు సృష్టించి, సంభాషణలను పెంచి, మరీ బండరాయి, కఱ్ఱ రాజుని బాదటంతో ముగించాడు శివయ్య.

"పేను లాంటి చిన్న పురుగు అన్ని జంతువులకు నాయకత్వం వహించి రాజుని కొట్టడం వింటే ఇప్పుడేమనిపిస్తోంది?" పెద్ద పిల్లల్ని అడిగాడు తాత.

"సిల్లీగా, పిచ్చిగా ఉన్న ఈ కథ చిన్నప్పుడెలా నచ్చిందా అని ఆశ్చర్యంగా ఉంది" నిర్మొగమాటంగా అన్నాడు ఆదిత్య.

"కొత్త వెలుగులో దాన్ని చూస్తే మరోలా అనిపించవచ్చు."

"అంటే?"

"నువ్వు ఇలియట్ పద్యాల గురించి నేను మీ ఇంటికి వచ్చినప్పుడు చెప్పేవు. అప్పుడవి నాన్న చాలా అద్భుతంగా చెప్పారు, వాటిలో గూఢార్థం ముఖ్యంగా."

"అలాగే ఈ పిల్లల కథల్ని కూడా అర్థం చేసుకోవాలి పెద్దవాళ్లు."


హైమ, శిశిర నవ్వుతూంటే ఆదిత్య తాతకేసి చూశాడు.

"అంటే కథలోని పేనుని పేనుగా కాక, ఒక అల్పప్రాణిగా నీచంగా, క్షుద్రుడుగా చూడబడే మనిషిగా చూడండి. వాడు స్వంతంగా పంట పండించడాన్ని అనుభవిస్తే రాజు ఏం చేస్తాడు? తన చేతి కింద, హీనుడుగా బ్రతుకుతూ, తను విసిరేసిన గింజలు ఏరుకు తినేవాడు స్వతంత్రుడు, నాయకుడు అయితే భరిస్తాడా? అణిచేసే ప్రయత్నం చేస్తాడు.

పెద్ద పులీ, రాయి, కఱ్ఱా మేథ ఉపయోగించని శ్రమజీవులకు సంకేతాలుగా తీసుకో, వాళ్లు తిరగబడితే ఏం జరుగుతుందో ఈ కథ చెప్తుంది."

"ఇప్పుడు ఈ కథ నిజంగా బాగుంది తాతా!" అంది సుజాత మనస్ఫూర్తిగా.

"కథలో అర్థం లేదనేముందు, మనకు అర్థం కాలేదేమో చూడాలి."



"ఇక ఈ రోజుకి చాలు, వెళ్లి పడుకోండి" అన్నపూర్ణ అందర్నీ తొందర పెట్టింది.

"ఒక్క నిముషం ఉండండి, ఇదేమిటో ఒక్కసారి చూపిస్తాం" అంటూ శివయ్య కేసి తిరిగింది లీల. "డౌటుంటే నాకు నిద్ర రాదు తాతా. అలాంటి మరో కథ అర్థం చెప్పండి. నాకు బాగా తెలిసిందయితే మంచిది."

"రాజుగారి ఏడుగురు కొడుకులు ఏడు చేపల కథ తెలుసా?"

"తెలుసు, తెలుసు."

"దానిలో బాధ్యత పక్క వాళ్ల మీదకి తోసే మానవనైజం చూడలేదూ?"

లీల ఆలోచనలో పడింది. "అవును ఆఖర్న చీమ, దర్జాగా, తప్పు చేస్తే శిక్ష ఉంటుందని చెప్పింది."

"అదే మరి, మిగిలిన సంగతులు కలలో చర్చిద్దువులే పద!" సుచిత, లీలను బలవంతాన లాక్కెళ్లింది.

000

మర్నాడు రాత్రి పిల్లలంతా త్వరగా భోజనాలు కానిచ్చి తాత గదిలో చేరిపోయారు. సిద్దుతో పోటీ పడి లీల కూడా శివయ్య పక్కకు వచ్చి కూర్చుంది. "తాతా, ఈ రోజు మంచి కథ చెప్పండి, మేం అర్థం చెప్పటానికి ట్రై చేస్తాం."

"నాన్నా మీ సొంత కథ ఉంది కదా, కాకి-పిచ్చుక స్పెషల్ కథ, అది చెప్పండి. కథలు అర్థం చేసుకోవటం, దీని తోటే కదా మేం నేర్చుకున్నాం" శిశిర సిఫారసు చేసింది.

"కాకి-పిచ్చుక కథ మీరు విన్నార్రా? అదే కొంచెం మార్పులతో ఉంటుంది, విని అర్థం చెప్పండి."

"కాకీ, పిచ్చుకా పొరుగు వాళ్లర్రా. కాకికేమో మంచి ఇల్లు, పిచ్చుకది పూరిల్లు, గాలివానొస్తే కూలిపోతుంది, తల దాచుకోటానికి అది కాకి ఇంటికి వస్తుంది."

"కాకి రానివ్వదు" ధీర అడ్డొచ్చింది.

"ఈ కాకి రానిస్తుంది. మొదట దానికి బాగా తిండి పెడుతుంది. కొన్నాళ్లు పోయాక నెమ్మదిగా పిచ్చిక శరీరంలోని ఒక్కొక్క భాగాన్నీ కోసి దానికి, దానితో పాటు అందరికీ వండిపెడుతుంది. పిచ్చుక ఆ విందులన్నీ హాయిగా తిని కాకి మంచితనాన్ని మెచ్చుకుంటూంటుంది. చివర్లో ఒక రోజు పిచ్చుక పొట్ట, ఒక రోజు మెడ, చివర తలా వండేస్తుంది. కాకి తల వండిన రోజు, హఠాత్తుగా పిచ్చుక తన శరీరమంతా వొండేసి అందరూ తినేసినట్లు తెలుసుకుంటుంది..."

చిన్న పిల్లలు 'అయ్యో, అప్పుడేమైంది' అని ఆత్రంగా వింటుంటే పెద్ద పిల్లలు నవ్వి నవ్వి అలసిపోయారు.

"ఆఖరు రోజున అన్నం తీసుకోబోతే చెయ్యి లేదు, తినబోతే నోరు లేదు, కాళ్లు లేవు, పొట్ట లేదు" అని వినేసరికి నాలుగేళ్ల సిద్దుకి దుఃఖం వచ్చేసింది. "పాపం, దానికి నోరు బొజ్జ లేకపోతే ఎలా తాతా?" అన్నాడు బెంగతో.

కథంతా శ్రద్ధగా విన్న లీలకు తలా, తోకా అందలేదు. "ఏమిటి తాతా దీని అర్థం? నాకేం తెలియటం లేదు."

"నెమ్మదిగా ఆలోచించు లీలా, తొందరేం లేదు."

"నాకర్థం అయినట్లే ఉంది తాతా!" ఆదిత్య ముందుకు వచ్చాడు, పల్లెటూరివాడు తన ఊళ్లో బ్రతకలేని పరిస్థితులు వస్తే పట్నం వచ్చి, మోసగాడి చేతిలో సర్వస్వం పోగొట్టుకోవటం ఈ కథ. అంతేనా?"

"అంతే, చిన్న పిల్లలకు జంతువులూ, దేవుళ్లూ, రాక్షసులూ అసహజమైన వాతావరణం, పాత్రలూ ఆకర్షణీయంగా ఉంటాయి, అలాటి విషయాలలో లోతైన అర్థం కూడా ఉండేలా ఉండాలి పిల్లల కథలు. అవి తెలుసుకోలేనివాళ్లు ఇంకేం చెయ్యగలుగుతారు? దాన్ని కప్పిపుచ్చుకొని హేళనకు దిగుతారు. మీరలా కాకూడదని, కథలు అర్థం చేసుకోవలసిన అవసరం చూపించాను. జాగ్రత్తగా వింటే, జీవితం గురించి తెలుసుకోటానికి కథను మించిన గురువు లేదు. వాటిని సరైన వెలుగులో చూడాలంతే."

"మీరు వండర్‌ఫుల్ తాతా!" లీల శివయ్యను ముద్దు పెట్టుకుంది.

పిల్లలు చప్పట్లు కొట్టారు. "ఎవరు రాకపోయినా ప్రతి సెలవలకూ ఇక్కడకు వస్తాను. మీరు అక్కడకు వచ్చినప్పుడు మా ఇంట్లో కూడా ఉండాలి. ఏం అమ్మమ్మా, సరేనా?"

అన్నపూర్ణ నవ్వుతూ, లీల బుగ్గలు నిమిరింది. సిద్దు స్నేహితుల్ని తీసుకువెళ్లటానికి వాళ్ల తల్లులు వచ్చారు.

సిద్దు కలవరిస్తున్నాడు, "పాపం పిచిక్కి బొజ్జ లేకపోతే ఎలా తాతా?" అంటూ.

## జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ కథలు, కవితల పోటీ ఫలితాలు

**జి.వి.ఆర్.** కల్చరల్ ఫౌండేషన్ రాష్ట్రస్థాయి కథలు, కవితల పోటీ ఫలితాల వివరాలను, ఫౌండేషన్ ఛైర్మన్ గుదిబండి వెంకట రెడ్డి ప్రకటించారు.

**కథల పోటీ విజేతలు**

ప్రథమ బహుమతి 'కొత్త వెలుగులో చూడు...' (కె. జ్యోతిర్మయి, 'వాసంతి'-కాకినాడ), ద్వితీయ బహుమతి 'మాతృదేవోభవ' (కోటగిరి రాధా హిమబిందు, మణుగూరు) తృతీయ బహుమతి 'పొగరికత నీడలో...' (ఎస్.రాజేశ్వరి, హైదరాబాద్) ప్రోత్సాహక బహుమతులు 'శిథిల చిత్రాలు' (శ్రీమతి శైలజామిత్ర, హైదరాబాద్), 'నిదురపో చల్లగా...' (ఎం.ఆర్.అరుణకుమారి, చిత్తూరు).

**కవితల పోటీ విజేతలు**

ప్రథమ బహుమతివి 'అమ్మా? అమెరికా డాలరా...?'వి మౌనశ్రీ మల్లిక్ (హైదరాబాద్), ద్వితీయ బహుమతి 'కిర భద్రంవిపెరుగు రామకృష్ణ (నెల్లూరు), తృతీయ బహుమతివిఆ'గమనం'విలపాక ప్రకాశ్ (విజయవాడ), ప్రోత్సాహక బహుమతివి 'ఒక గ్రామిక యుగళమనోగీతం' కూచిమంచి ఎస్.వి. సింగరాజు (ములగపూడి, తూర్పుగోదావరి)